రైతుబంధు ఎట్లిస్తరు?

- సాగుసాయంపై రేవంత్ మళ్లీ అక్కసు
- ఆపటం విఫలమవడంతో మరో కుట్ర
- ఎన్నికల ముందు ఎలా ఇస్తారని నిలదీత
- బిచ్చమని ఒకసారి, రైతుబంధుతో తాగుతున్నారని మరోమారు వ్యాఖ్యలు
- ఈసీ అనుమతించినా మళ్లీ అడ్డుపుల్లలు
- పీసీసీ అధ్యక్షుడి తీరుపై రైతుల ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): రైతుబంధు పథకంపై మొదటి నుంచీ అక్కసు వెళ్లగక్కుతున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మరోమారు అదే పాటపాడారు. యాసంగికి సిద్ధమవుతున్న రైతుల ఖాతాల్లో రైతుబంధు పైసలు పడకుండా ఈసీకి ఫిర్యాదు చేసి అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెంటనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వం ఆ ఫిర్యాదును పట్టించుకోవద్దని, సకాలంలో రైతుబంధు విడుదల చేయకుండా యాసంగి సీజన్ ఎత్తిపోయే అవకాశం ఉందని, కాబట్టి రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేసేందుకు అనుమతి ఇవ్వాలని రెండు మూడుసార్లు ఈసీని కోరింది. రైతు సంక్షేమం కోసం కాబట్టి నిధుల విడుదలకు ఈసీ తాజాగా ఆమోదం తెలిపింది. రేవంత్ రెడ్డికి ఇదికూడా కంటగింపుగా మారింది. రైతుబంధు సొమ్ముతో ఎన్నికలను ప్రభావితం చేస్తారని ఆరోపిస్తూ నిధుల విడుదలను అడ్డుకునేందుకు మరోమారు కుట్ర చేస్తున్నారు. ప్రభుత్వ సొమ్ముతో ప్రజల ఓట్లు కొనుగోలు కొనాలని సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని దుష్ప్రచారానికి దిగారు. ఎన్నికలకు మూడు రోజుల ముందు రైతుబంధు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్‌కు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరించిందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ది ఫెవికాల్ బంధమని మరోమారు తేలిపోయిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు రైతుబంధు వేయడంతో రైతులకు రూ. 5 వేల నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. రైతుబంధుపై రేవంత్ అక్కసు ఇప్పటిది కాదు.. గతంలోనూ ఆయన రైతుబంధును 'బిచ్చం'గా అభివర్ణించారు. రైతుబంధు సొమ్ముతో రైతులు తాగుతున్నారని అవమానించారు. ఇప్పుడు ఏకంగా రైతుబంధును అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల సంఘం అనుమతినిచ్చినా మళ్లీ మోకాలడ్డే ప్రయత్నం చేస్తున్న రేవంత్‌పై రైతులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

కాంగ్రెస్ ఝూటా క్యాలెండర్

ఇప్పడున్న నోటిఫికేషన్లు రద్దుచేస్తారా?
ఇప్పటికే రాసిన పరీక్షలు సంగతేంది?

- జాబ్ క్యాలెండర్ ఇవ్వాల్సింది టీఎస్‌పీఎస్సీ
- పోస్టుల భర్తీకి అనుమతి వరకే సర్కారు పని
- ఏడాదిలో 2 లక్షల పోస్టుల భర్తీ సాధ్యమా?
- దేశంలో ఇప్పటివరకు ఎక్కడైనా చేశారా?
- కర్ణాటకలో ఈ ఆరు నెలల్లో ఎన్ని భర్తీ చేశారు?
- ఖాళీల లెక్క తేల్చకుండానే నోటిఫికేషన్లు ఇస్తారా?
- వచ్చే ఏప్రిల్ - మే మధ్య లోక్‌సభ ఎన్నికలు
- ఎన్నికల కోడ్‌లో పరీక్షలు ఎలా నిర్వహిస్తారు?
- జాబ్ క్యాలెండర్ పేరుతో కాంగ్రెస్ మరో మోసం
- ఓట్లేసుకొన్నంక కర్ణాటక ప్రజల పరిస్థితే



హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): అధికారం కోసం కాంగ్రెస్ ఎన్ని అడ్డదారులైనా తొక్కుతుందని మరోసారి రుజువైంది. దశాబ్దాలుగా ప్రజల భావోద్వేగాలు, బలహీనతలతో ఆడుకొంటూ వస్తున్న ఆ పార్టీ.. తెలంగాణ ఎన్నికల్లో మరోసారి అదే ఎత్తు వేసింది. యువతను బుట్టలో వేసుకొనేందుకు మేధావులే ఆశ్చర్యపోయే ప్లాన్ వేసింది. యువతలో సహజంగా ఉండే భావోద్వేగాలను ఓట్లుగా మార్చుకొనేందుకు కుట్రలు మొదలుపెట్టింది. అందులో భాగంగా 'జాబ్ క్యాలెండర్' అంటూ కొత్త నాటకం మొదలుపెట్టింది. 'ఆలులేదు చూలు లేదు.. కొడుకు పేరు అదేదో అన్నట్టు' ఒకవైపు ఎన్నికల్లో గెలిచే అవకాశమే లేదని సొంతపార్టీ నేతలే చేతులెత్తేస్తుండగా.. మరోవైపు దింపుడు కల్లం ఆశలతో యువతను ఆకర్షించేందుకు జాబ్ కాలెండర్ అంటూ మీడియాలో శనివారం ప్రకటలు ఇచ్చింది. అంతటితో ఆగకుండా నోటిఫికేషన్లు ఇచ్చే తేదీలను కూడా ప్రకటించేసింది. నిజంగా నోటిఫికేషన్లు ఇచ్చే శారన్నట్టుగా యువతను భ్రమింపజేస్తున్నది.

అసాధ్యమని తెలిసీ..

అధికారంలోకి వస్తే మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటనలు గుప్పించింది. ఒక్క ఏడాదిలో 2 లక్షల జాబ్స్ భర్తీచేయటం అసాధ్యం. వాస్తవానికి జాబ్ క్యాలెండర్‌ను ఒక పార్టీ లేదా ప్రభుత్వం ప్రకటించవు. రాజ్యాంగ బద్ధమైన టీఎస్‌పీఎస్సీ, ఇతర నియామకపు ఏజెన్సీలు మాత్రమే ప్రకటించాలి. కమిషన్ సభ్యులు, బోర్డు సభ్యులు సమావేశమై పూర్వాపరాలను పరిశీలించి ఎప్పుడు ఏ ఉద్యోగాలను భర్తీ చేయాలో నిర్ణయించి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి. యూపీఎస్సీ సైతం ఇదే సంప్రదాయాన్ని పాటిస్తున్నది. రాజ్యాంగబద్ధంగా నియమితులైన కమిషన్, బోర్డు సభ్యులు నిర్ణయించాల్సిన పనిని కాంగ్రెస్ సొంత కార్యక్రమంగా మార్చేసింది. అంటే తాము అధికారంలోకి వస్తే రిక్రూటింగ్ ఏజెన్సీలను తమ జేబు సంస్థలుగా మారుస్తామని చెప్పకనే చెప్పింది. వాస్తవానికి ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వ పాత్ర పరిమితంగా ఉంటుంది. క్యాబినెట్/ ఆర్థిక శాఖ అనుమతిచ్చి ఆయా ఉద్యోగాల భర్తీని రిక్రూటింగ్ ఏజెన్సీలకు అప్పగిస్తుంది. రిక్రూటింగ్ ఏజెన్సీలు నోటిఫికేషన్లు జారీచేసి పరీక్షలు నిర్వహించి ఎంపికైనవారి జాబితాను ప్రభుత్వానికి సమర్పిస్తే వారిని ప్రభుత్వం ఉద్యోగులుగా నియమిస్తుంది. ఇలా ప్రకటించే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించే అధికారం ఏ ప్రభుత్వానికి ఉండదు. ఇలా చేయడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం.

మళ్లీ కాంగ్రెస్ కనుసన్నల్లోకేనా?

కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఏపీపీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలనేకం. 2013లో ఏపీపీఎస్సీ ఉద్యోగాలను బహిరంగ మార్కెట్లో అమ్మినట్టుగా బేరానికి పెట్టి సంధ్యారాణి అనే మహిళ ఓ టీవీ చానల్‌కు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికింది. ఒక్కో పోస్టుకు రూ.10 లక్షలకు బేరంపెట్టగా, దాంట్లో ఏపీపీఎస్సీ సభ్యుడొకరు తనకు రూ.2.5 లక్షలు కమిషన్ ఇస్తానని హామీ ఇచ్చినట్టు ఆమె బహిరంగంగా ఒప్పుకున్నది. నంద్యాల మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ కార్యకర్త, ఆదిలాబాద్ జడ్పీ ఫ్లోర్ లీడర్, చాంద్రాయణగుట్ట నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసిన వ్యక్తి, సత్తెనపల్లిలో కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించిన వారిని కమిషన్ సభ్యులుగా నియమించిన దాఖలాలున్నాయి. ఏపీపీఎస్సీ సభ్యుడిగా పనిచేసిన రిపుంజయరెడ్డి ఏసీబీ కేసులో ఇరుక్కున్నారు. 1980లో రాజాజీ అనే ఐఏఎస్ అధికారిని ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమించారు. నిప్పులాంటి మనిషిగా పేరు తెచ్చుకున్న ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగాను పనిచేశారు. కమిషన్ చైర్మన్‌గా నియమితులైన 3 నెలలకే ఆయన రాజీనామా చేశారు. అక్రమాలను సహించలేక, ఒత్తిళ్లకు లొంగలేక రాజీనామా చేశారు.

అలా జరిగితే.. ఇలా మోసపోవాల్సిందే

- గ్రూప్-1 నోటిఫికేషన్‌ను 1-2024న జారీచేస్తామని జాబ్ క్యాలెండర్‌లో కాంగ్రెస్ ప్రకటించింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్ -1 ఉద్యోగాల సంఖ్య 503 మాత్రమే. ఇప్పటికే ఈ 503 గ్రూప్-1 ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించాల్సి ఉన్నది. ఖాళీ పోస్టులు లేకుండా మళ్లీ గ్రూప్ -1 నోటిఫికేషన్‌ను ఎలా విడుదల చేస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మళ్లీ నోటిఫికేషన్ జారీచేయడమంటే పాత నోటిఫికేషన్‌ను రద్దుచేయడమే. అంటే నిరుద్యోగులను మళ్లీ మోసగించడంలో భాగమేనన్నది సుస్పష్టం.
- 9,168 గ్రూప్ -4 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయడమే కాకుండా రాత పరీక్షను నిర్వహించగా, ఫలితాల వెల్లడి మాత్రమే మిగిలి ఉన్నది. ఈ తరుణంలో 1-6-24, 1-12-24 తేదీల్లో రెండు విడుతల్లో నోటిఫికేషన్లు జారీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అంటే పాత నోటిఫికేషన్‌ను తుంగలో తొక్కడమే అవుతుంది. అసలు ఇలా ఒక నోటిఫికేషన్‌ను రద్దుచేసే అధికారం కూడా టీఎస్‌పీఎస్సీకే ఉంటుంది. తాజా పరస్థితుల్లో రద్దుచేయడం సాధ్యమేనా? అలా చేస్తే పరీక్ష రాసిన వారి సంగతి ఏమిటి? ఇలా చేస్తే మళ్లీ కోర్టుకేసులు, వివాదాలతో తమ చేతికి మట్టి అంటకుండా ..ఉద్యోగాలు భర్తీ కాకుండా.. నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టేందుకే కాంగ్రెస్ ఈ నాటకం ఆడుతున్నదని మేధావులు విమర్శిస్తున్నారు.
- ఇప్పటికే గ్రూప్ -2లో ఖాళీగా ఉన్న 783, గ్రూప్ -3 క్యాడర్‌లోని 1,365 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టుల్లో ఖాళీలు ఉత్పన్నమయ్యే సమస్యేలేదు. ఏడాదికి ఒకసారి గ్రూప్ - 1, ఏడాది రెండుసార్లు గ్రూప్ 2, 3,4 నిర్వహిస్తామని చెప్పడం ఆచరణసాధ్యం కూడా కాదు. దేశ చరిత్రలో ఇది వరకు ఎక్కడా జరగలేదు. సాంకేతికకంగా ఎక్కడా సాధ్యపడదు కూడా.
- మరో దారుణమైన విషయం ఏంటంటే జూనియర్, పాలిటెక్నిక్ డిగ్రీ లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, లైబ్రేరియన్, లెక్చరర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. కొన్నింటికి పరీక్షలు సైతం నిర్వహించారు. వీటిని టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రకటించిన క్యాలెండర్‌లో కాలేజీ కమిషన్ రిక్రూట్ చేస్తుందని ప్రకటించారు. రాష్ట్రంలో ఇలాంటి నియామక సంస్థ అనేదే లేదు. ఇదంతా పూర్తిగా నిరుద్యోగులను మోసపుచ్చే, మభ్యపెట్టే వ్యవహారమనేందుకు ఈ ఒక్క నిదర్శనం చాలు.
- అసిస్టెంట్ మోటార్ వెహికిల్, టీచర్, గురుకుల ఉద్యోగాలు సహా కాంగ్రెస్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్న ఉద్యోగాలన్నింటికి టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే నోటిఫికేషన్లు విడుదలచేసింది. నియామక ప్రక్రియ ఏదో ఒక దశలో ఉన్నది. అయినా తాము ఏదో పొడిచేస్తాం అన్నట్టుగా ప్రకటనలు గుప్పించడం అంటే ఉద్యోగార్థులను మోసం చేయడమేనని స్పష్టమవుతున్నది.
- 2024 మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో పార్లమెంట్ ఎన్నికలొచ్చే అవకాశమున్నది. ఎన్నికల కోడ్ సమయంలో నోటిఫికేషన్లు ఇవ్వడం అసాధ్యం. శనివారం ఇచ్చిన ప్రకటనలో 2024 ఫిబ్రవరి నుంచి మే వరకు తేదీలను ప్రకటించింది. ఇలాంటి మోసపూరిత ప్రకటనలివ్వడమంటే ఉద్యోగార్థులు, యువతను మభ్యపెట్టడమే అవుతుంది.

లోకం పోకడ



మమ్మల్నే బిచ్చగాళ్లంటావా? ఈ ఎన్నికల్లో మిమ్మల్ని రాజకీయ బిచ్చగాళ్లని చేసుడు ఖాయం!

మరో 2 రోజులు వర్షాలు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. బంగాళాఖాతంలో దక్షిణ అండమాన్ పరిసరాల్లో సోమవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశముందని, మంగళవారం నాటికి అది అల్పపీడనంగా మారే అవకాశం ఉందని చెప్పింది. అనంతరం పశ్చిమ-వాయవ్య దిశగా కదిలి 29 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని వివరించింది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా సిద్దిపేట జిల్లా సింగారంలో 60 మి.మీ., ములుగు జిల్లా మేడారంలో 54 మి.మీ, నల్లగొండ జిల్లా తెల్దేవరపల్లిలో 43 మి.మీ, నాగర్‌కర్నూల్ జిల్లా వంకేశ్వర్‌లో 28 మి.మీ, వరంగల్ జిల్లా నల్లబెల్లిలో 27 మి.మీ, మేడిపల్లి, పాలకుర్తిలో 23 మి.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	19.2°c	30.3°c
మెదక్	19.6°c	28.3°c
నల్లగొండ	20.0°c	31.8°c
వరంగల్	21.0°c	30.0°c
ఖమ్మం	21.0°c	31.0°c
హైదరాబాద్	21.3°c	28.2°c
నిజామాబాద్	21.4°c	27.1°c
కరీంనగర్	22.0°c	29.0°c
మహబూబ్‌నగర్	22.2°c	29.5°c
రంగారెడ్డి	28.8°c	29.9°c

3 గంటలు బాయికాడ పంటే రేవంత్‌కు ఎవుసం తెలుస్తది

మొదటిపేజీ తరువాయి...

ఒక్కడే అటు, ఇటు తిరిగే సరికి కరెంటు పోయేది. దాంతో మా పిల్లలను మా అమ్మ (పెద్ద సూరారం) వాళ్లింట్లో వదిలి పెట్టి, మేమిద్దరం అర్ధ రాత్రి సైకిల్ వేసుకొని వెళ్లి చెరో బావి దగ్గర పడుకొని కరెంటు పెట్టిన రోజులు ఉన్నయ్. తెలంగాణ గవర్నమెంట్ వచ్చినకాడి నుంచి మాకు 24 గంటల కరెంటు వస్తుంది. మా ఆడబిడ్డలతో పాటు మా ఆయన కూడా ఇంట్లోనే పడుకుంటుండు. సంవత్సరం అంతా పారుతున్నది పొలం. నాలుగు బోర్లు వేసుకున్నం. అవన్నీ మంచిగ నీళ్లు ఇస్తున్నయ్. ఇప్పుడేమో బోర్లకు పెద్ద మోటర్లు పెట్టాలని రేవంత్‌రెడ్డి అంటున్నడు. గీ నీళ్లకు పెద్ద మోటర్లు ఎట్ల పెడ్తడు? అసలు పెట్టకూడదు కదా! ఒకటేసరి పెద్ద లావు కట్టె తెచ్చి నోట్లో పెడితే పడ్తదా? పట్టదు కదా. ఇప్పుడు బోర్లు పోసే నీళ్లకు, 24 గంటల కరెంటుకు మాకు సరిపోతుంది. 3 గంటల కరెంటుకు ఎట్ల సరిపోతుంది? మాకు తెలంగాణ గవర్నమెంట్ కావాలె. మేం కేసీఆర్‌కే ఓటేస్తం. కాంగ్రెస్‌కు ఓటెయ్యం. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటెయ్యాలె? మా తాతలు, ముత్తాతలు తెల్లందాకా బావుల కాడ పడుకొని ఉరేసుకొని, పాములు, తేళ్లు కరిచి.. పడుకున్నోళ్లు పడుకున్నట్టే చచ్చిపోయిర్రు. వేరేవాళ్ల భూముల్ని కౌలుకు పట్టుకొని పంటలు పండక అప్పులయ్యి చచ్చిన రోజులున్నయ్. ఈ రోజు మాకు ఏ బాధా లేదు. మావోళ్లు సాయంత్రం 6 గంటలకు వచ్చి ఇంట్లో పండుకుంటే, మళ్లీ పొద్దున ఆరు గంటలకు బాయికాడికి పోయి పని చూసుకుంటుర్రు. మళ్లా కాంగ్రెస్ వాళ్లను తీసుకొస్తే, మళ్లా పాములు కరుసుడు, తేళ్లు కుట్టుడు. ఉరేసుకునుడు. మందు డబ్బాలు పట్టుకొని సచ్చుడు.. ఇసోంటివి మాకు అవసరం లేదు. కాంగ్రెస్‌కైతే వెయ్యనే వెయ్యం. ఆ రేవంత్ రెడ్డి మాట్లాడే మాటలకు ఒక్కదానికి కూడా అర్థంపర్థం లేదు. ఆయనొచ్చి ఒక 3 గంటలు బాయికాడ పండుకొని పొలం పారిస్తే ఆయన ఎన్ని ఎకరాలు పారిస్తున్నడో తెలుస్తది. పోయి ఏసీ రూముల్లో పడుకుంటే రైతుల కష్టాలేం కనిపిస్తయ్? మా బాధలు, కష్టాలు ఏం కనిపిస్తయ్? రేపటి రోజు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. మళ్లా నా ఇద్దరు బిడ్డలు, నేను ఆడోళ్లం ఇంట్లో పడుకుంటే, మా ఆయన పోయి బాయికాడ పడుకుంటే మా పరిస్థితి ఏంది? రేవంత్‌రెడ్డికి అంటే ముడ్డి చుట్టూ ముగ్గురు గన్‌మెన్లను పెట్టుకుంటడు. మరి మాకు లేరు కదా. కాబట్టి కాంగ్రెస్ గవర్నమెంట్ అస్సలు వద్దు. నేను ఒక మహిళను అయ్యి ఉండి కూడా వ్యవసాయం చేస్తున్న. ఆరు ఎకరాల పొలం పెట్టుకున్నం. 300 బస్తాల వడ్లు అయినయ్. ప్రభుత్వం మంచిగ వడ్లు కొంటున్నది. మాకు రేటు కూడా తగినంత ఇస్తున్నది. బ్యాంకుల చుట్టూ, దాని చుట్టూ, దీని చుట్టూ తిరిగే అవసరం లేకుండా అకౌంట్లో పైసలు పడుతున్నయ్. ఆ అవసరం కూడా లేదు. మాకు ఇప్పుడు ధైర్యం ఉంది. అప్పులోళ్లకు, ట్రాక్టర్‌కు, దున్నినోళ్లకు ఉన్నకాడినుంచే మంచిగ పైసలు ఇస్తున్నం. ఇప్పుడే మంచిగున్నం. కారు గుర్తుకే ఓటేస్తం. కేసీఆర్‌నే గెలిపించుకుంటం' అని తేల్చి చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటున్నదని, రైతులకు అన్ని రకాలుగా లబ్ధి చేకూరుతున్నదని పేర్కొన్నారు.

కరెంటు 3 గంటలే!

మొదటిపేజీ తరువాయి...

ఎత్తినట్టుగా పచ్చబుడుతున్న రాష్ట్రాన్ని మళ్లీ బుగ్గిపాలు చేయాలని కుట్రలకు తెరలేపారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తాజా వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. వ్యవసాయానికి 5 గంటల కరెంటు సరిపోతుందని, అంతకంటే ఎక్కువ అవసరంలేదని ఆయన శుక్రవారం తేల్చి చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటకలో రైతులకు తామేమీ 24 గంటల విద్యుత్తు ఇవ్వటంలేదని తెలిపారు. వ్యవసాయానికి 5 గంటలే కరెంటు ఇస్తున్నట్టు స్పష్టంగా చెప్పారు. 'కర్ణాటక రైతులకు 24 గంటల విద్యుత్తును ఇవ్వట్లేదు. 5 నుంచి 7 గంటలు సరఫరా చేస్తున్నాం. వ్యవసాయానికి ఆ కరెంటు రైతుకు సరిపోతుంది' అని తెలిపారు. డీకే వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం మండిపడుతున్నది. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఓటేస్తే తమ బతుకులు మళ్లీ అంధకారంలోకి వెళ్తాయని, 24 గంటల ఉచిత విద్యుత్తు 5 గంటలకే పరిమితమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరెంటుపై తొలి నుంచీ కుట్రలే

తెలంగాణ రైతుల గోసతీర్చి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తుకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. ఈ ప్రకటన వెలువడగానే కాంగ్రెస్ విషం చిమ్మింది. 2018లో గాంధీభవన్‌లో సమావేశమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవుసానికి 9 గంటల కరెంటు చాలని తీర్మానించారు. కాంగ్రెస్ మోసపూరిత కుట్రలను తిప్పిగొట్టిన సీఎం కేసీఆర్.. రైతన్న పక్షాన నిలిచారు. 2018 నుంచి వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తును ఇస్తున్నారు. దీనికోసం రాష్ట్రంలో వినియోగమయ్యే మొత్తం విద్యుత్తులో 33 శాతాన్ని సాగు కోసమే ప్రత్యేకంగా కేటాయించారు. కేసీఆర్ సంకల్పంతో తెలంగాణ రాష్ట్రం దేశానికే బువ్వగిన్నెగా మారింది. రైతన్నకు కరెంటు కష్టాలు తీరాయి. దీనిని చూసి ఓర్వలేని కాంగ్రెస్ మరోసారి తన దుర్బుద్ధిని బయటపెట్టింది. 'రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుంది. 24 గంటల ఉచిత విద్యుత్తు అవసరంలేదు' అని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ అంతటా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు ఎవుసానికి 5 గంటల కరెంటు సరిపోతుందని డీకే వ్యాఖ్యానించడంపై సర్వత్రా విమర్శలవర్షం కురుస్తున్నది. తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్తుకు ఎగనామం పెట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

కర్ణాటక ప్రజలకు కాంగ్రెస్ వెన్నుపోటు

వ్యవసాయానికి 24 గంటలపాటు విద్యుత్తును సరఫరా చేస్తామంటూ కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అక్కడి రైతన్నలను నిండా ముంచింది. ఎడాపెడా కరెంటు కోతలకు తెగబడింది. దీంతో సాగుకు నీరులేకపోవడంతో వేల ఎకరాల పంటలు ఎండిపోయే దుస్థితి దాపురించింది. దీన్ని చూసి తట్టుకోలేని అన్నదాతలు సొంత డబ్బుతో నీటి ట్యాంకర్లను పొలాలకు తెప్పించుకొని పంటను కాపాడుకొన్నారు. కరెంటు విషయంలో మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. హెస్కామ్ కార్యాలయానికి ట్రాక్టర్‌లో ఓ రైతు మొసలిని తీసుకొచ్చారు. గుల్బర్గా జిల్లాలో ఓ రైతు పురుగుల మందు తాగి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. కరెంటు కోసం ఆందోళనలు చేసిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేయించి దుర్మార్గంగా వ్యవహరించింది. ఇదేదో తమ గొప్పగా భావించిన డీకే శివకుమార్.. తెలంగాణలోని తాండూరుకు వచ్చి కర్ణాటకలో ఎవుసానికి 5 గంటల కరెంటు ఇస్తున్నట్టు ఆర్భాటంగా చెప్పుకొన్నారు. డీకే వ్యాఖ్యలపై సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ నడిచింది. '24 గంటల కరెంటు ఇస్తున్న తెలంగాణ నేతలను.. 5 గంటల కరెంటు కూడా ఇవ్వని కర్ణాటకకు ఎలా ఆహ్వానిస్తున్నారు?' అంటూ పలువురు నెటిజన్లు డీకేకు చురకలంటించారు.

తెలంగాణలో విద్యుత్తు వినియోగం (మిలియన్ యూనిట్లలో)

సంవత్సరం	మొత్తం కరెంటు వినియోగం	వ్యవసాయానికి వినియోగం
2014-15	30,183	11,671
2015-16	40,650	11,190
2016-17	43,729	14,374
2017-18	50,526	18,241
2018-19	57,591	20,696
2019-20	58,522	17,959
2020-21	56,111	18,946
2021-22	61,349	19,144
2022-23	66,661	19,937

రేవంత్‌కు ఓటమే!

మొదటిపేజీ తరువాయి...

అలాగే చేస్తుండటంతో ఈసారి కూడా పోలింగ్‌కు ముందే రేవంత్ ఓటమి ఖాయమైందని తేలిపోయింది. రెండు రోజుల్లోనే మూడు సభలకు ఆయన మొఖం చాటేశారు. పీసీసీ అధ్యక్ష హోదాలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నా.. సొంత నియోజకవర్గం కొడంగల్‌లోనే ఆయన్ను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గతంలో మాదిరిగానే ఆలస్యంగా ఈ విషయాన్ని గ్రహించిన ఆయన, ఇతర ప్రాంతాల్లో ప్రచార సభలను రద్దు చేసుకుంటున్నారు. శుక్రవారం కామారెడ్డిలో ప్రచారాన్ని రద్దు చేసుకోగా శనివారం షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం సభలను రద్దు చేసుకున్నారు. ఇకపై పూర్తిగా కొడంగల్‌పైనే దృష్టి పెట్టేందుకు సభలను రద్దు చేసుకున్నట్టు తెలిసింది. అయితే పార్టీ నేతలు మాత్రం హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం వల్లే సభలు రద్దయ్యాయని కాకమ్మ కథలు చెప్తున్నారు. అసలు కారణం మాత్రం కొడంగల్‌లో ఓటమి భయమే.

కాంగ్రెస్ 'సీఎం'లకు ఓటమి భయం

మొన్నటివరకు తామే సీఎం అభ్యర్థులమని గల్లాలు ఎగరేసిన కాంగ్రెస్ నేతలంతా ఇప్పుడు సొంత నియోజకవర్గాల నుంచి కదలటం లేదు. పోలింగ్ తేదీ దగ్గరపడుతున్నాకొద్దీ వాళ్లలో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తున్నది. ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జగ్గారెడ్డి, జానారెడ్డి, సీతక్క, మధుయాష్కీగౌడ్ వంటి కీలక నేతలు అన్ని సభలను రద్దుచేసుకొని సొంత సెగ్మెంట్లలో సెటిలైపోయారు. సభలకు వెళ్లినా జనం లేక ఖాళీ కుర్చీలకు ప్రసంగాలు వినిపించాల్సి వస్తున్నది. మరోవైపు సొంత నియోజకవర్గాల్లో ఇప్పటికే పరిస్థితి చేయిదాటిపోయింది. దీంతో మిగిలిన ఈ రెండురోజుల్లోనైనా కష్టపడి డిపాజిట్లు దక్కించుకొని పరువు కాపాడుకొనే పనిలో పడ్డారు. ఇతర నియోజకవర్గాల్లో ప్రచారంపై ప్రశ్నిస్తే.. పార్టీ గెలుపు సంగతి దేవుడెరుగు ముందు తాను గెలవాలికదా అని ప్రశ్నిస్తున్నారు.

గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి: టీఎంసీ

కోల్‌కతా, నవంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను నెలలకొద్దీ తమ వద్దే ఉంచుకోవద్దని, ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని గవర్నర్లను ఉద్దేశించి ఇటీవల సుప్రీంకోర్టు పేర్కొనడాన్ని స్వాగతిస్తున్నామని బెంగాల్‌కు చెందిన అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తెలిపింది. గవర్నర్లను అడ్డంపెట్టుకొని ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పెత్తనం చెలాయించాలని చూస్తున్న కేంద్రానికి ఇది గుణపాఠమని, ఇలాంటి వ్యవస్థను రద్దు చేయాలని పేర్కొన్నది.

మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు

ఇంఫాల్, నవంబర్ 25: మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత చోటుచేసుకున్నది. గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో గ్రామ సహాయకుడు మరణించాడు. ఈ ఘటన శనివారం కాంగ్‌పోకి జిల్లాలోని ఓ గ్రామంలో చోటుచేసుకున్నది. తుపాకులతో గ్రామంలోకి ప్రవేశించిన కొందరు తొలుత ఓ వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. దీంతో అక్కడున్న వాళ్లు నిలదీయడంతో గొడవ పెరిగి కాల్పులకు దారి తీసింది.

కాంగ్రెస్ నేతలపై పరువునష్టం దావా వేస్తా

- నా పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించారు
- నా ఇంట్లో దొరికిందేమీ లేదు
- రిటైర్డ్ ఐఏఎస్ ఏకే గోయెల్ వివరణ

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం వారి మెడకే చుట్టుకొన్నది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏకే గోయెల్ తన ఇంట్లో నగదు డంప్ చేశారని ఈసీకి తప్పుడు ఫిర్యాదు చేసి బొక్కాబోర్లాపడ్డారు. చివరికి ఎన్నికల అధికారుల తనిఖీల్లో ఏమీ దొరక్కపోవడంతో తల దించుకొన్నారు. దీనిపై శనివారం ఏకే గోయెల్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తన నిజాయతీని శంకిస్తూ.. సోదాలు చేయించి, మీడియాలో, సోషల్ మీడియాలో లేనిపోని తప్పుడు వార్తలు సృష్టించి తన పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించిన కాంగ్రెస్ నేతలపై పరువునష్టం దావా వేయనున్నట్టు గోయెల్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో పనిచేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు తన నివాసంలో మద్యం, నగదు నిల్వ చేశారనే వచ్చిన ఆరోపణలపై తనిఖీ చేయడానికి వచ్చిందని చెప్పారు. రాత్రి వరకూ ఇల్లంతా సోదా చేసి, సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించిన తర్వాత నగదు, మద్యం ఏమీ లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయారని వెల్లడించారు. ఈ క్రమంలో ఈసీకి తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన తెలంగాణ కాంగ్రెస్ నాయకులు గోయెల్ ఇంటిముందు నానా యాగీ చేశారు. దీనికి ఆజ్యం పోసేలా కాంగ్రెస్ మాజీ ఎంపీ మల్లు రవి, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్, ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి వచ్చి తన ఇంటి ముందు ఆందోళనకు దిగి, రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి, తన పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తించారని గోయెల్ చెప్పారు. తన ఇంట్లో దొరికింది ఏమీ లేకపోయినా.. వారి రెచ్చగొట్టిన వ్యాఖ్యలు వలనే గంటల తరబడి కాంగ్రెస్ కార్యకర్తలు తన ఇంటి ముందు వికృతంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లరిమూకలను కట్టడి చేయడంలో సహకరించిన పోలీసులకు, భద్రతా బృందాలకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

ఐబీలో...

మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 995
- పోస్టులు: గ్రేడ్-2 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్/ఎగ్జిక్యూటివ్
- అర్హతలు: డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు 18-27 ఏండ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 15
- వెబ్‌సైట్: www.ncs.gov.in

ఐఎల్‌బీఎస్‌లో...

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ & బైలరీ సైన్సెస్ (ఐఎల్‌బీఎస్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 6
- పోస్టులు: ప్రొఫెసర్, కన్సల్టెంట్, హెల్త్ కౌన్సెలర్, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 10
- వెబ్‌సైట్: http://www.ilbs.in

ఎన్ఐఓఎస్‌లో..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 62
- పోస్టులు: డిప్యూటీ డైరెక్టర్, ఈడీపీ సూపర్‌వైజర్, గ్రాఫిక్ ఆర్టిస్ట్, ఎంటీఎస్, జేఈ తదితరాలు
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 21
- వెబ్‌సైట్: https://nios.cbt-exam.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఫిజిక్స్, నీట్-ఐఐటీ కెమిస్ట్రీ, ఇంగ్లిష్ గ్రామర్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.